# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం | 12 డిసెంబర్ 2025 | పేజీలు 8






నాలా కన్వర్షన్ చేసిన స్థలం ఇదే..



ప్రభుత్వ బోర్డు తొలగించి, కబ్జాదారులకు నాలా కన్వర్షన్ చేసిన 329 ప్రభుత్వ భూమి ఇదే..




చుట్టూ సర్వే నెం.329 ప్రభుత్వ భూమి.. మధ్యలో దీవపంలా, 328 పట్టాభూమి..

# కుత్బుల్లాపూర్‌లో..!
# భూ కుంభకోణం..!

- ప్రభుత్వ భూమిని- పట్టాభూమిగా సృష్టించిన ఏడి సర్వేయర్..?
- అదే ప్రభుత్వ భూమికి నాలా కన్వర్షన్ చేసిన మహిళా తహశీల్దార్..!

గత పదేళ్ళలో,ఎందరో ఎమ్మార్వోలు చేయలేని సాహసం..! ఓ మహిళా తహశీల్దార్, మూడు నెలలే, విధుల్లో ఉన్నప్పటికీ, తన సాహసోపేత నిర్ణయంతో.. రూ.15 కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని, కబ్జాదారులకు అధికారికంగా, నాలా కన్వర్శన్‌తో, ధారాదత్తం చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.. సర్వే నెం.328 పట్టాభూమిలో ఉన్నదే 10:39 గుంటలు, అందులో ప్రైవేటు వెంచర్(వీనస్ రాక్ హైట్స్) వెలిసింది.. రోడ్లు కాకుండానే..! 328 పట్టాభూమి పేరుతో అదనంగా 7545 గజాలు రిజిస్ట్రేషన్‌లు కూడా ముగిసాయి.. దీంతో అసలు మిగులు భూమిలేని, ఆ పట్టాభూమిని సర్వేల సాకుతో..! సర్వే నెం.329 ప్రభుత్వ భూమిలో ఏడీ సర్వేనిర్వహించి పట్టాభూమిగా తేల్చడం, హాస్యాస్పదం..! ఇదిలా ఉండగా అక్రమ నాలా కన్వర్శన్ వ్యవహారాన్ని, ఓ మహిళా తహ శీల్దార్‌తో మమః అనిపించారు.. సంబంధిత తహశీల్దార్‌కి కనీస అవగాహన లేదని, స్పష్టమవుతుంది.. అయినప్పటికీ 2000 వేల గజాల ప్రభుత్వ భూమికి "నాలా కన్వర్శన్" చేయడం గమ నార్హం.. అయినా ఈ రోజుల్లో "డబ్బంటే చేదెవరికి" చెప్పండి..! ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో డబ్బులు కూడా చేతులు మారినట్టు స్పష్టమవుతుంది..! "చెలిమలో నీటిలా" ఊరుతున్న ఈ 328 పట్టాభూమి మాటున..! ప్రభుత్వ భూమిలో తెరపైకి వచ్చిన ఈ భూ కుంభకోణంలో రెవెన్యూ అధికారులే కీలక సూత్రదారులుగా ఉన్నట్టు తేటతెల్లం చేస్తోంది.. హాస్యాస్పద విషయం ఏమిటంటే..! 2017-2023-24లో 3 సార్లు అక్రమ నిర్మాణాలు కూల్చేసిన కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులే.. ఈ నాలా కన్వర్శన్ చేయడం అధికారుల చేతివాటానికి నిదర్శనం..! ఇందులో మరో సంచలన ఆరోపణ, ఏమిటంటే, మేడ్చల్ జిల్లా కలెక్టర్ స్వయంగా, నాలా కన్వర్శన్ కోసం ఫోన్‌చేసారట.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 11:

-2లో

- గాజులరామారం సర్వే నెం.328 పట్టాభూమి పేరుతో..! 329 ప్రభుత్వ భూమికి ఎసరు..?
- సర్వే నెం.328 పట్టాభూమిలో ఉన్నదే 10.39 ఎకరాలు.అదనంగా 7545 గ. కబ్జా..
- సముద్రంలా సర్వే నెం.329 ప్రభుత్వ స్థలం..! ద్వీపంలా సర్వే నెం.328 పట్టాభూమి..!!
- రీ సర్వేల పేరుతో కనుమరుగు అవుతున్న సర్కారు భూములకు దిక్కెవరు..?
- తప్పుడు ఏడి సర్వేల నివేదికతో..? ప్రభుత్వ భూమికి తహశీల్దార్ నాలా కన్వర్శన్..!
- 2017-2023-24లో 3 సార్లు కూల్చేసిన కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు..

# నేడు మొక్కజొన్న రైతుల ఖాతాల్లో
# రూ.588 కోట్లు జమ

## ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో తుమ్మల తనిఖీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వరంగ సంస్థ మార్క్‌ఫెడ్‌కు మొక్కజొన్న లను విక్రయించిన 55,904 మంది రైతుల ఖాతా ల్లో శుక్రవారం రూ.588 కోట్లు జమ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామని గురువారం వెల్లడించారు. కేంద్రం మక్కల కొనుగోళ్లపై చేతులెత్తేయగా రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి 2.45 లక్షల

-3లో

# కేంద్ర ప్రభుత్వ విత్తన బిల్లు ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాం

## భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విత్తన బిల్లు ప్రతిపాదనను భారత రాష్ట్ర సమితి వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. రైతన్నలకు నష్టం కలిగించేలా, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న విత్తన బిల్లును వెంటనే ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'ఈ విత్తన బిల్లు కార్యరూపం దాల్చితే ఎలాంటి ట్రయల్స్ లేకుండానే విదేశీ విత్తనాలు దేశంలోకి వచ్చే ప్రమాదముంది. విత్తనాల అంశంలో రాష్ట్రాల పాత్ర లేకుండా చేస్తున్న ఈ బిల్లును అందరూ వ్యతిరేకించాల్సిన అవసరముంది. ఈ బిల్లులో నకిలీ విత్తనాలను కట్టడి చేసే అంశంపై స్పష్టత లేదు. కార్పొరేట్

-3లో



# కుత్బుల్లాపూర్‌లో..! భూ కుంభకోణం..!



నేడు నాలా కన్వర్షన్ చేసిన స్థలంలో, 2017లో విఆర్వో గా రజినికాంత్ కూల్చివేతలు..ఫైల్ఫోటో..



2017 నాటి అక్రమ నిర్మాణం కూల్చివేతల్లో నాడు విఆర్వో- నేడు ఆర్ఐ రజినికాంత్..

**కుక్కతోకకు గుండ్రాయి కట్టినా..! వంకర వంకరే..! కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారుల తీరు.. గతంలో గాజులరామారం 307, 342, 329 ప్రభుత్వ భూముల కబ్జాల్లో ఆర్ఐ సహా ముగ్గురు విఆర్ఏలు, అక్రమార్కులతో ఒప్పందం కుదుర్చుకుని 2500 అక్రమ నిర్మాణాల వ్యవహారంలో కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలపై.. 2023లో కలెక్టర్ సస్పెండ్ చేశారు.. అయినప్పటికీ కొద్దిగా గ్యాప్ ఇచ్చిన కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు తమ నైజాన్ని నిరూపిస్తున్నారు.. బరితెగించి విధులు నిర్వర్తిస్తున్నారు.. పట్టాభూమి పేరుతో ఈ ప్రభుత్వ భూమికి నిస్సిగ్గుగా "నాలా కన్వర్షన్" చేశారు.. ప్రభుత్వ భూములు పరిరక్షించే ప్రత్యేక విభాగం, రెవెన్యూ శాఖలో.! కొందరు ఇలాంటి అవినీతి అధికారుల చేతివాటానికి సర్కారు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.. అక్రమార్జనే ధ్యేయంగా, విధులు నిర్వర్తిస్తూ అవగాహనా రాహిత్యంతో వ్యవహరిస్తున్నారు.. కలెక్టర్ చెబితేనే నాలా కన్వర్షన్ చేశానని ఆ మహిళా తహశీల్దార్ పొంతనలేని సమాధానం చెబుతుండగా..! ప్రస్తుతం విధుల్లో ఉన్న తహశీల్దార్‌ని ప్రశ్నిస్తే..! ఏడి సర్వే రిపోర్ట్ ఉందని, బాధ్యతా రహితంగా సమాధానం పలు అనుమానాలను రేకెత్తిస్తుంది.. 328 పట్టాభూమిపై, కుత్బుల్లాపూర్ తహశీల్దార్‌కి, అసలు అవగాహన ఉందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..**



2023-24 లో అదే ఆర్ఐ రజినికాంత్ ఆధ్వర్యంలో కూల్చేసిన స్థలమే కన్వర్షన్ చేసినది..

- మొదటి పేజి తరువాయి

"కంచే చేనుమేసిన చందంగా" తయారైంది ప్రభుత్వ భూముల పరిస్థితి.. ముఖ్యంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో, అధికారుల అండతోనే, భూ కబ్జాదారులకు సర్కారు భూములు ధారాదత్తం చేస్తున్నారు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత "పరిపాలనా సౌలభ్యం కోసం" తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయంతో, ఒక్కో మండలాన్ని 'రెండు-మూడు' మండలాలుగా విభజించారు.. ఇది మంచి పరిణామమే అయినప్పటికీ..! కొందరు లంచగొండి అధికారులకు అనుకూలంగా తయారైంది.. పరిపాలనా సౌలభ్యం సంగతి ఏమోకానీ..! ప్రభుత్వ భూములు అధికారుల సలహాలు, సూచనలతోనే ఆక్రమణకు గురవుతున్నట్టు, కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెం.329, 307, 342 ప్రభుత్వ భూములే ప్రత్యేక నిదర్శనం.. కుత్బుల్లాపూర్ తహశీల్దార్ కార్యాలయానికి ఓ ప్రత్యేకత కూడా ఉంది.. అధికారులే ఒప్పందం కుదుర్చుకుని, కబ్జాదారులకు కట్టబెట్టిన వ్యవహారంలో, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ఆర్ఐ, సహా ముగ్గురు విఆర్ఏలను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో "పరిపాలనా సౌలభ్యం" కోసమే మండలాల విభజన జరిగిందో..! లేక భూ కబ్జాదారులకు సులభంగా దోచిపెట్టడానికే మండలాలను విభజించారో ఏమోకానీ..! ప్రస్తుతం ఇలాంటి పరిణామాలు చూస్తుంటే, "దొంగలు దొంగలు-ఊర్లు పంచుకున్న" సామెతకు అద్దం పడుతుంది.. ఒకప్పుడు (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో) చాటు మాటు కబ్జాలు మాత్రమే ఉండేవి.. ఇప్పుడు అదేమి లేదు..! అంతా బరితెగింపు వ్యవహారమే.. పట్టపగలే ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే, కాపాడాల్సిన అధికారులు "కమిట్‌మెంట్‌లతో" కామ్‌గా ఉంటున్నారు.. పైగా ప్రశ్నించిన మీడియాకు "సిగ్గుమాలిన" సమాధానం చెపుతున్నారు.. లంచగొండి అధికారులపై చర్యలు చేపట్టాల్సిన ఉన్నతాధికారులు, కూడా మౌనం వహించి..! భూ కుంభకోణాలకు తెరలేపుతున్నారు..

## చెలిమలో నీటిలా..! ఊరుతున్న పట్టాభూమి..!

మీకు పట్టాభూమికి సంబంధించిన పత్రాలు, మీవద్ద ఉంటే చాలు..! సంబంధిత పట్టాభూమి అక్కడ ఖాళీగా లేకపోయినా పర్వాలేదు..! పక్కనే ప్రభుత్వ భూమి ఉంటే చాలు, అధికారికంగా మీ సొంతం అయినట్టే..! అదెక్కడో మారుమూల పల్లెటూరులో అనుకుంటే పొరపాటే అవుతుంది.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలోనే ఈతతంగం అధికారుల చేతివాటాన్ని బట్టబయలు చేస్తోంది..! అయితే షరతులు మాత్రం వర్తిస్తాయట (కండీషన్స్ అప్లై).. అదెక్కడో, ఏంటో చూద్దాం రాండి.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెం.329 "ప్రభుత్వ భూమిలో-పట్టాభూములు" పుట్టుకొస్తున్నాయి. "చెలిమ"లో నీటిలా..! ఊరుతున్న ఈ పట్టాభూమి" పక్కా ఆధారాలతో, గూగుల్ కోఆర్డీనేట్స్‌తో స్కెచ్ మ్యాప్‌లతో కబ్జాదారులకు అప్పగించేందుకే అధికారులు విధుల్లో ఉండటం విశేషం.. తప్పుడు "ఏడి సర్వేలతో" ప్రభుత్వ భూమిని, పట్టాభూమిగా సృష్టించి నివేదిక ఇస్తున్నారు.. ఈ సర్వే నివేదిక సాకుతో, వెంటనే తహశీల్దార్ నాలా కన్వర్షన్ చేయడం, ఆపై అక్రమార్కులకు అప్పగించడం.. చకచకా జరిగిపోతాయ్.. ఈ మొత్తం ఎపిసోడ్‌లో చక్రం తిప్పేది అధికార యంత్రాంగమే కీలకపాత్ర పోషించడం బాధాకరం..

## 2017 నుంచి 2024 వరకు రెవెన్యూ కూల్చివేతలు..

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెం. 329 ప్రభుత్వ భూమిలో, అక్రమ నిర్మాణాలను, 2017 నుంచి 2024 వరకు పలుమార్లు కూల్చివేసిన రెవెన్యూ అధికారులు.. ఇప్పుడు అదే ప్రభుత్వ స్థలాన్ని అక్రమార్కులకు పట్టాభూమిగా కట్టబెట్టడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. నాడు (2017) "విఆర్వో"గా అక్రమ కట్టడాలను కూల్చివేసిన రెవెన్యూ అధికారి రజినికాంత్.. 2023-24 లోనూ, "ఆర్ఐ"గా రెండు సార్లు అక్రమ నిర్మాణాలను రజినికాంత్ కూల్చేశారు.. ప్రస్తుతం అదే ప్రభుత్వ భూమిని కుత్బుల్లాపూర్ తహశీల్దార్ బాధ్యతా రహితంగా నాలా కన్వర్షన్ చేయడం గమనార్హం.. భూ పరిరక్షణకు అధికారులుగా ఉంటూ, అసలు మిగులు భూమి లేని 328 పట్టా భూమి ఉన్నట్టు, ఏడి సర్వేయర్ ఇచ్చిన తప్పుడు నివేదికను సాకుగా చూపించి, రెండు నెలల క్రితం విధుల్లో ఉన్న ఓమహిళా తహశీల్దార్ కబ్జాదారలకు అనుకూలంగా నాలా కన్వర్షన్ చేయడం, అవినీతి అధికారులకు నిదర్శనం..












# ప్రశాంత వాతావరణంలో మెదటి విడత పోలింగ్ నిర్వహణ పూర్తి



**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లా లో మొదటి విడత 7 మండలాల్లోని గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.గురువారం మేడిపల్లి మండల కేంద్రంలోని కొండాపూర్ గ్రామం, భీమారం మండల కేంద్రంలోని కమ్మరిపేట, కోరుట్ల మండలంలోని సంగెం, నాగులపేట్, ఐలాపూర్ గ్రామాలు, మెట్ పెల్లి మండలంలోని వెల్లుల్ల, జగ్గసాగర్ గ్రామాలు, ఇబ్రహీంపట్నం మరియు మల్లాపూర్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

మెట్ పెల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ జిల్లా సాధారణ పరిశీలకులు జి. రమేష్ తో కలిసి పోలింగ్ జరుగుతున్న కేంద్రాలను పరిశీలించారు.ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు.పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల జాబితాను పరిశీలించారు.గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్య పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఒకటి తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం లోపలికి అనుమతించకూడదని ఎన్నికల అధికారులను ఆదేశించారు.

ఈ పరిశీలనలో అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి, డిపివో రఘువరన్, జిల్లా నోడల్ అధికారులు, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, ఎమ్మార్వో లు, ఎంపిడివోలు, తదితరులు ఉన్నారు.

**జిల్లాలో మొదటి విడత పోలింగ్ శాతం 77.68**

మొత్తం 2,18,194 ఓట్లలో పోలైన ఓట్లు 1,69,846

జగిత్యాల జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత ఎన్నికల పోలింగ్ 77.68 శాతం నమోదు అయింది.

భీమారం, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, కోరుట్ల, మల్లాపూర్, మేడిపెల్లి, మెట్ పెల్లి మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు.

7 మండలాల్లో కలిపి మొత్తం ఓట్లు 2,18,194 ఉండగా పోల్ 1,69,846 అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 77.68 శాతం పోలింగ్ నమోదు అయింది.

**మండలాల వారిగా ఓటర్లు.. నమోదు అయిన పోలింగ్ శాతం..**

భీమారం మండలంలో మొత్తం ఓటర్లు 17,577మంది ఉండగా, 13,476 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 76.67 శాతం నమోదు అయింది.

ఇబ్రహీంపట్నం మండలంలో మొత్తం ఓటర్లు 30,465 మంది ఉండగా, 23,802 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 78.13 శాతం నమోదు అయింది.

కథలాపూర్ మండలంలో మొత్తం ఓటర్లు 37,516 మంది ఉండగా, 28,042 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 74.75 శాతం నమోదు అయింది.

కోరుట్ల మండలంలో మొత్తం ఓటర్లు 31,243 మంది ఉండగా, 24,617 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 78.79 శాతం నమోదు అయింది.

మల్లపూర్ మండలంలో మొత్తం ఓటర్లు 41,103 మంది ఉండగా, 32,913 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.07 శాతం నమోదు అయింది.

మేడిపెల్లి మండలంలో మొత్తం ఓటర్లు 24,251 మంది ఉండగా, 18,777 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.43 శాతం నమోదు అయింది.

మెట్ పెల్లి మండలంలో మొత్తం ఓటర్లు 36,039 మంది ఉండగా, 27,859 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.3 శాతం నమోదు అయింది.

# భారత్‌లోని కృత్రిమమేధ వ్యవస్థకు తగిన రీతిలో మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ పెట్టుబడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల ఇవాళ బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. భారత్‌లోని కృత్రిమమేధ వ్యవస్థకు తగిన రీతిలో మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన తెలిపారు. క్లోడ్ కంప్యూటింగ్ వ్యవస్థను కూడా మైక్రోసాఫ్ట్ మరింత పటిష్టం చేసేందుకు పనిచేస్తున్నట్లు చెప్పారు. లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడం ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఉత్తమైన మౌళిక సదుపాయాల్ని కల్పించనున్నట్లు చెప్పారు.సుమారు 17.5 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్లు సత్యానాదెళ్ల తెలిపారు. ఆసియా ఖండంలోనే మైక్రోసాఫ్ట్‌కు చెందిన అత్యంత భారీ పెట్టుబడి ఇదేఅని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌ద

విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్ తెలిపారు. అజూర్ కంప్యూటర్ వ్యవస్థపై వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 70 కన్నా ఎక్కువ సంఖ్యలో డేటా సెంటర్లు ఉన్నాయన్నారు. భారత్‌లోనూ మైక్రోసాఫ్ట్ సెంటర్లు పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. గిట్‌హబ్ లో 2030 నాటికి ఇండియా నెంబర్ వన్‌గా మారుతుందని ఆయన అంచనా వేశారు.భారత్‌లో జియోతోనూ భాగస్వామ్యం ఉందన్నారు. 2026లో కొత్త డేటా సెంటర్ ప్రాంతం ఆపరేషనల్‌గా మారనున్నట్లు నాదెళ్ల చెప్పారు. దక్షిణమధ్య భారతంలో కొత్త డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోనున్నట్లు నాదెళ్ల పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సుమారు రెండు కోట్ల మంది భారతీయులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు నాదెళ్ల తెలిపారు. ప్రభుత్వానికి చెందిన ఈ-శ్రమ్ ప్రోగ్రామ్ ద్వారా అసంఘటిత కార్మికులను ఏఐతో చైతన్యపరచవచ్చు అన్నారు. భారత్‌లోని ప్రతి వ్యక్తిని, ప్రతి సంస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నాదెళ్ల పేర్కొన్నారు.

# నేడు మొక్కజొన్న రైతుల ఖాతాల్లో రూ.588 కోట్లు జమ

- మొదటి పేజి తరువాయి

టన్నుల మక్కలను కొనుగోలు చేసిందని తెలిపారు. మంత్రి తుమ్మల గురువారం హైదరాబాద్‌లోని ఆయిల్‌ఫెడ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయానికి విధులకు హాజరుగాని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ పనితీరు, నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవల్ని సమీక్షించారు.

# కేంద్ర ప్రభుత్వ విత్తన బిల్లు ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

కంపెనీలకు అనుకూలంగా విత్తనాల ధరలను నిర్ణయించే విధంగా ఈ బిల్లులో నిబంధనలున్నాయి. నకిలీ విత్తనాల తయారీలో కంపెనీలను బాధ్యులను చేయకుండా, కేవలం అమ్మకందారులు బాధ్యత వహించేలా చట్టాన్ని రూపొందించారు. రైతన్నల ప్రయోజనాలు, వ్యవసాయ సంక్షేమ అభివృద్ధికి ఉపయోగపడేలా బిల్లును తేవాలి. త్వరలోనే ఈ అంశంపై పార్టీ తరపున రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్రానికి మరిన్ని సూచనలు ఇస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# దుబాయి నుంచి కోమా పేషెంట్ ను తెప్పించండి



**హైదరాబాద్ పెన్ పవర్:**దుబాయిలో కోమాలో ఉన్న తన భర్త ఆరెల్లి గంగరాజంను ఇండియాకు తెప్పించాలని జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం పొలాసకు చెందిన రాజవ్వ ఇటీవల హైదరాబాద్ బేగంపేట ప్రజా భవన్ లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట దరఖాస్తు చేశారు. గుండె సంబంధిత ఆరోగ్య సమస్యతో అకస్మాతుగా అపస్మారక స్థితిలోకి జారిన గంగరాజం (64) నవంబర్ 12 నుంచి దుబాయి అల్-గెసిస్ లోని ఆస్టర్ హాస్పిటల్ లో కోమాలో ఉన్నాడు. వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వ జిఏడి ఎన్నారై విభాగం దుబాయి లోని ఇండియన్ కాన్సులేట్ తో సంప్రదింపులు జరిపింది.

తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి సహకారంతో, పేషెంట్ కుటుంబ సభ్యులు సీఎం ప్రజావాణి ఇంచార్జి, తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డిని కలిశారు. పేషేంట్ దుబాయి నుంచి హైదరాబాద్ చేరుకున్న తర్వాత నిమ్స్ హాస్పిటల్ లో వైద్యం అందించాలని అయన సంబంధిత అధికారులను ఆదేశించారు. పేషేంట్ గంగరాజం కుమారుడు జలంధర్, దుబాయి లోనే ఉండటం వలన దగ్గరుండి సపర్యలు చేస్తున్నారు. దుబాయి లోని తెలంగాణ సామాజిక సేవకులు రవి డేవిడ్ ఇండియన్ కాన్సులేట్, కంపెనీ యాజమాన్యం, హాస్పిటల్ తో సమన్వయం చేస్తున్నారు.

# కొండగట్టులో అగ్ని ప్రమాద బాధితులకు జగిత్యాల లేడీస్ ఎంపోరియం సంఘం సభ్యుల చేయుత

**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రతుకు దెరువు కోసం కొండగట్టుకు వచ్చి చిన్న దుకాణాల్లో బొమ్మలు, గాజులు, పిల్లలకు ఆట వస్తువులు అమ్మి జీవనోపాది పొందుతున్న కుటుంబాలు గతకొద్ది రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రులైన వారికి మేము సైతం ఉన్నామంటూ జగిత్యాల లేడీస్ ఎంపోరియం సంఘం సభ్యులు తోపాటు అనుబంధ హోల్ సేల్ వ్యాపారస్తులు చేయూత అందజేశారు, లేడీస్ ఎంపోరియం అసోసియేషన్ సంఘం అధ్యక్షులు దీటి అజయ్య పటేల్ ఆధ్వర్యంలో కట్టుబట్టలతో నిరాశ్రులైన 8 కుటుంబాలతో పాటు మరియు మిగతా 15 కుటుంబాలకు కూడా లేడీస్ ఎంపోరియం అసోసియేషన్ జగిత్యాల తరపున వారికి నిత్యవసర వస్తువులు అందజేశారు.దాదాపు 8 కుటుంబాలకు ఆ దుప్పట్లు, రగ్గులు, బెడ్ షీట్స్, చెవుల రాజలింగయ్య పటేల్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందించారు.




జగిత్యాల లేడీస్ ఎంపోరియం సంఘం ద్వారా భారత్ క్లాత్ సారి సెంటర్ కటుకం అమర్నాథ్ ఆ కుటుంబాలకు 23 చీరేలు అందజేసారు.

ఈ కార్యక్రమంలో లేడీస్ ఎంపోరియం అసోసియేషన్ సంఘం అధ్యక్షులు దీటి అజయ్య పటేల్,గౌరవ అధ్యక్షులు కొత్తపెల్లి నాగభూషణం, ములస్తం మల్లికార్జున్, కోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఊటూరి శ్రీదర్,కోశాధికారి నీలి వేణుమాధవ్,సహాయ కార్యదర్శి అజీజ్ నూరి,ఉపాధ్యక్షులు కైలాష్ పతి, ప్రకాష్, కొక్కుల రమేష్,కాంధేశ్ శ్రీనివాస్, బి శ్రీనివాస్ ,దీటి లక్ష్మణ్, అశోక్,నాంపేల్లి మల్లన్న మార్వాడి గణేష్, తదితరులు పాల్గొన్నారు

# ఈనెల 31 లోగా జాయింట్ ఎల్పిఎం దరఖాస్తు చేసుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**అన్నమయ్య జిల్లాలో సొంత భూమి కలిగిన భూ యజమానులందరూ జాయింట్ ఎల్ పి ఎం విభజన కొరకు దరఖాస్తులను ఈ నెల 31 లోపు తప్పనిసరిగా సంబంధిత సచివాలయాలు లేదా మీసేవ కేంద్రాలలో సమర్పించవలసిందిగా జిల్లా సంయుక్త కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక అవకాశం వల్ల డిసెంబర్ 31 వరకు దరఖాస్తు రుసుం కేవలం రూ.50 మాత్రమే ఉంటుందని దీనిని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. డిసెంబర్ 31 తర్వాత ఈ రుసుం రూ.550 కి పెరుగుతుందన్నారు. అందువల్ల ఈ సదవకాశాన్ని వినియోగించుకుని, జాయింట్ ఎల్పిఎం విభజన చేయించుకోని భూ



యజమానులు వెంటనే తమ సచివాలయాలు / మీ–సేవ కేంద్రాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.భూ రికార్డులు సక్రమంగా ఉండడం భవిష్యత్తులో భూ సంబంధిత అన్ని సేవలు పొందటానికి అత్యంత అవసరమని అందువల్ల భూయజమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సూచించారు.రామాపురం మండల తాసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ తాసిల్దార్ కార్యాలయ సిబ్బందితో పి జి ఆర్ ఎస్ రి సర్వే తదితర అంశాలపై సమీక్షించి కార్యాలయం సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం రాయచోటి డివిజన్లోని 08 మండలాలకు సంబంధించిన 41 వెబ్ ల్యాండ్ మార్పుల దస్త్రాలపై చర్యలు తీసుకునేందుకు స్వయంగా క్షేత్ర క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత మండల తాసిల్దారులతో చర్చించి సదరు దస్త్రాలపై చర్యలు తీసుకున్నారు.

# నిధుల మంజూరికి కృషి చేసిన ఎంపీ అర్వింద్

**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని వివిధ బ్రిడ్జిలు నిర్మాణం కోసం నిధులిప్పించాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గతంలోనే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కుమార్ ను కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే విన్నపాన్ని గుర్తుంచుకొన్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్ గత రెండు రోజుల క్రితం కేంద్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసిన ఎంపీ అర్వింద్ అవసరాన్ని వివరించడంతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని అంతర్గాం, అంబరిపేట ల మధ్య ఫ్లై ఒవేర్, అండర్ పాస్ నిర్మాణం, అనంతారం వద్ద హై లెవల్ వంతెన, చల్ గల్, సింగరావుపేట, ఇటిక్యాల గ్రామాల మధ్యలో హైలెవల్ బ్రిడ్జి,




బోర్నపెల్లి, జగన్నాథ్ పూర్ మధ్య హైలెవల్ వంతెన నిర్మాణం కోసం జగిత్యాల లో ఇటీవలే జరిగిన దిశ మీటింగ్ లో ఎంపీ అర్వింద్ ను కోరడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన విన్నపాన్ని పరిశీలించిన ఎంపీ రెండు రోజుల క్రితం కేంద్ర రోడ్లు భవనాల మంత్రి నితిన్ గడ్కరిని కోరడమైనదని దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన విన్నపాన్ని మన్నించి నిధుల మంజూరు కు కృషి చేసిన ఎంపీ అర్వింద్ కు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్

**హైదరాబాద్ పెన్ పవర్:**మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే 8 మండలాల్లో పోలింగ్ సరళిని కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో, వి సి హాల్ లోని పోలింగ్ మానిటరింగ్ సెల్ లో ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి స్క్రీన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు.

# పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**హైదరాబాద్ పెన్ పవర్:**యాదాద్రి భువనగిరి జిల్లాలోని మొదటి విడత ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. తుర్కపల్లి మండలం రుస్తాపురం గ్రామంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు జిల్లా కలెక్టర్. ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు

## జాతీయ రహదారిపై రద్దీ

**హైదరాబాద్ పెన్ పవర్:**యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువయింది. మొదటి విడత ఎన్నికల్లో భాగంగా పట్టణం నుండి వాహనదారులు పల్లెబాట పట్టారు. హైదరాబాద్ నుండి నల్గొండ సూర్యాపేట మిర్యాలగూడ ఖమ్మం లకు ఆర్టీసీ బస్సుల్లో ప్రైవేట్ వాహనాల్లో ఓటర్లు భారీగా బయలుదేరారు

## వార్డు మెంబర్ అభ్యర్థికి గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలో 5 వ వార్డు మెంబర్ అభ్యర్థి విజయలక్ష్మికి గాయాలయ్యాయి. పోలీస్ వాహనం డోర్ అకస్మాత్తుగా తెరవడంతో వెనుక వస్తున్న విజయలక్ష్మి ద్విచక్రవాహనంపై నుంచి పడిపోవడంతో చేయి విరిగింది.

# కోతుల గ్యాంగ్ వార్

**హైదరాబాద్ పెన్ పవర్:**పోచారం సర్కిల్ పరిధిలోని ప్రతాపసింగారంలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. గ్రూపులుగా ఏర్పడి గ్యాంగ్ వార్ కు దిగుతున్నాయి. ఇవాళ ఉదయం సింగారం ప్రధాన కూడలిలో సుమారు 60 కోతులు 2 గ్రూపులుగా విడిపోయి పరస్పరం భీకర సమరానికి కాలుదువ్వాయి. స్థానికులు వాటిని చెదరగొట్టడంతో శాంతించాయి. కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని జీహెచ్ఎంసి అధికారులను నివాసితులు డిమాండ్ చేసినా, పెడచెవిన పెడుతున్నారని ఫైరవుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**సంగారెడ్డి జిల్లా పెన్ పవర్:**:పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ ను వెనక నుంచి కారు ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. . పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రపురం పరి ధిలోని బీరంగూడ మల్లికార్జుననగర్ కాలనీకి చెందిన మొగులప్ప (58), మేస్త్రీ మహిపాల్ తో కలిసి బైక్ పై పటాన్ చెరు నుంచి పాశమైలారం వెళ్తు న్నాడు. ఇస్నాపూర్ ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఓ క్రెటా కారు ముందు వెళ్తున్న బెలోనో కారును ఢీకొని ముందు వెళ్తున్న బైక్ ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న మహిపాల్ కు స్వల్ప గాయాలవ్వగా వెనకాల కూర్చున్న మొగులప్పకు తీవ్ర గాయా లయ్యాయి. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొం దుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## రెండు నిమిషాల వీడియోలతో చాయ్ షాట్స్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు డిజిటల్ ఎంటర్టైన్మెంట్ రంగంలో పాపులర్ అయిన చాయ్బిస్కెట్ సంస్థ 'చాయ్ షాట్స్' పేరుతో కొత్త ఓటీటీ వేదికను మొదలుపెట్టింది. షార్ట్ సిరీస్ కంటెంట్ ప్రొడక్షన్ ప్రధానంగా ఈ ఓటీటీ పనిచేయనుంది. 'చాయ్ షాట్స్' ఓటీటీ లాంచ్ చేశారు. ఈ వేడుకలో రానా దగ్గుబాటి, అగ్ర నిర్మాత వై.రవిశంకర్ తదితరుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాయ్ బిస్కెట్ శరత్ మాట్లాడుతూ 'చాయ్ షాట్స్ను మేము రెండు నెలల క్రితం లాంచ్ చేశాం. మంచి రెస్పాన్స్ వచ్చింది. చైనా, యుఎస్, కొరియా, జపాన్ వంటి దేశాల్లో షార్ట్ సిరీస్ కంటెంట్కు మంచి డిమాండ్ ఉంది. ఇండియాలో తొలిసారి ఈ కాన్సెప్ట్ ప్రధానంగా ఈ ఓటీటీ ప్లాట్ఫామ్ను లాంచ్ చేస్తున్నాం. ప్రస్తుతం తెలుగులో స్ట్రీమ్ చేస్తున్నాం. త్వరలో అన్ని భాషల్లో లాంచ్ చేస్తాం' అన్నారు. కెరీర్ ఆరంభం నుంచి కొత్త కంటెంట్కు ప్రాధాన్యం ఇస్తున్నామని, సరికొత్త ఫీచర్స్తో చాయ్షాట్స్ను లాంచ్ చేశామని, తెలుగు డిజిటల్ మీడియాలో ఇదొక ప్రయోగమని చాయ్ బిస్కెట్ అనురాగ్ రెడ్డి తెలిపారు. ఈ ఓటీటీలో హీరో రానాతో పాటు స్విగ్గీ, రెడ్బస్, ఫిజిక్స్వాలా, రాపిడో, దార్విన్బాక్స్, విర్జియో వంటి సంస్థలు ఇన్వెస్టర్లుగా ఉన్నారు.

## బ్యాలెట్ పత్రాన్ని చింపేసిన వ్యక్తిపై కేసు నమోదు

**హైదరాబాద్ పెన్ పవర్:**శంషాబాద్లో బ్యాలెట్ పత్రాన్ని చింపేసిన వ్యక్తిపై కేసు నమోదు అయింది. వెల్దండ మండలం కుప్పగండ్ల పంచాయతీలో ఓ వార్డు అభ్యర్థికి గుర్తు కేటాయించకపోవడంతో పోలింగ్ నిలిచిపోయింది. మహబూబాబాద్ మండలం అమనగల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు ఓటర్ల కాళ్లు మొక్కి ఓటు వేయాలని వేడుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా జాడి జమాల్పూర్ లో ఇద్దరు పేషెంట్లు అంబులెన్స్లో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి సంగారెడ్డి తహసిల్దార్ జయరాం సైకిల్ తొక్కుకుంటూ వచ్చారు.

## ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడిన రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝూ



**హైదరాబాద్ పెన్ పవర్:**మంథని మండలం గుంజపడుగు గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ సందర్భంగా తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వృద్ధురాలితో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆప్యాయంగా మాట్లాడి ఆమె ఓటర్ గుర్తింపు వివరాలు, వార్డ్ సమాచారం తెలుసుకున్నారు. ఓటు ఎక్కడ పోలింగ్ బూత్ లో వినియోగించుకోవాలో తెలపడం జరిగింది. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అక్కడున్న పోలీసు సిబ్బందిని సహాయం చేస్తారని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు, ప్రతి ఓటరు స్వేచ్ఛగా, భయభ్రాంతులు లేకుండా ఓటు వేయడానికి సమగ్రంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

# ప్రశాంతంగా తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు

**హైదరాబాద్ పెన్ పవర్:**కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న 05 మండలాల్లోని కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్దంపూర్, చెర్లభూత్కూర్, దుబ్బపల్లి, చామనపల్లి, ఫకీర్ పేట్, జూబ్లీ, నగునూరు పలు పోలింగ్ కేంద్రాలను ఈరోజు సందర్శిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది పనితీరును, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని అధికారులకు, సిబ్బందికి సీపీ సూచించారు.ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకోవడం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.తొలిదశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పర్యవేక్షించడంలో కరీంనగర్ పోలీస్ యంత్రాంగం నిమగ్నమై ఉందని సీపీ ఈ సందర్భంగా తెలిపారు.

# మలక్ పేట్ గంజ్ పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం నాడు మలక్ పేట్ గంజ్ ను సందర్శించి హమాలీలు, వ్యాపారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

కవిత మాట్లాడుతూ పాత హైదరాబాద్ కు కిరాణా సామాగ్రి సరఫరాకు ఈ గంజ్ ప్రధాన కేంద్రంగా ఉండే. ఇక్కడ చాలా పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతుండే. ఇప్పుడు కాస్త తగ్గింది. వేరే మార్కెట్ యార్డ్ లు పెరగటం, ట్రాన్స్ పోర్ట్ సౌకర్యాలు పెరగటంతో వ్యాపారం కాస్త తగ్గింది. అయినప్పటికీ ఇప్పటికీ హైదరాబాద్ లో మలక్ పేట్ గంజ్ పెద్ద మార్కెట్ యార్డ్ గా ఉందని అన్నారు.

ఇక్కడి హమాలీల కోసం కేర్ తీసుకోవటం మంచి విషయం. మన వాళ్ల కన్నా కూడా ఇతర రాష్ట్రాల హమాలీలే ఇక్కడ ఎక్కువగా ఉన్నారు. ఐతే ఇక్కడ శానిటేషన్ మీద జీహెచ్ఎంసీ వాళ్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. లైట్లు, డ్రైనేజీ వ్యవస్థ బాగుండేలా చర్యలు చేపట్టాలి. ఫ్యూచర్ లో పెద్ద మార్కెట్ కోహెడకు వెళ్లినప్పటికీ ఇక్కడ కూడా మార్కెట్ ఇలాగే కొనసాగుతుంది. 42 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ మార్కెట్ లో కనీస సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్ననని అన్నారు.

# ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి.: పెన్ పవర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం జిల్లాలోని గణపురం మండలంలోని జెడ్పీ ప్రాథమికోన్నత పాఠశాల, గాంధీనగర్లోని సిఎస్ఐ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉదయం 10 గంటలకు గంటలకు నమోదైన పోలింగ్ శాతం, కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతున్నదా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించి పోలింగ్ స్టేషన్ సందర్శన రిజిస్టరులో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా

కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని మొదటి విడత జరుగుతున్న గణపురం, రేగొండ, కొత్తపల్లి గోరి, మొగుళ్లపల్లి మండలాల్లో గ్రామ పంచాయతి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా కొనసాగుతున్నట్లు తెలిపారు.

ప్రజలు ఉదయం నుండి మంచి ఓటు హక్కు వినియోగానికి వస్తున్నారని, ఇంకా ఓటు వేయని అర్హులందరూ మధ్యాహ్నం 1 గంటకు ముందుగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా, మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవు తుందని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో భాస్కర్, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్



**వేములవాడ అర్బన్/ రూరల్, డిసెంబర్ - 11 పెన్ పవర్:**గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న పలు పోలింగ్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం సందర్శించారు. వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక, అనుపురం, ఆరెపల్లి, వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల, నూకలమర్రి, చెక్కపల్లి, ఎదురుగట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించి, అధికారులతో మాట్లాడారు.ఆయా పోలింగ్ కేంద్రాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు షాక్

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు భారీ ఎదురు దెబ్బ తగిలింది. దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటుండగా, శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం సంచలన నిర్ణయంతో ప్రభాకర్ రావుకు లొంగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
సిట్ ఎదుట రేపే సరెండర్ ు ఫిజికల్ టార్చర్ చేయొద్దని ప్రత్యేక ఆదేశాలుసుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాల ప్రకారం, ప్రభాకర్ రావు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ (%ూ×ు%) అధికారుల ఎదుట బేషరతుగా లొంగిపోవాలి. ఈ ఆదేశాలు కేసు దిశనే మార్చేలా ఉన్నాయని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.అయితే, లొంగిపోయే ప్రక్రియలో లేదా తదుపరి దర్యాప్తులో ప్రభాకర్ రావుపై ఎటువంటి శారీరక హింస, ఫిజికల్ టార్చర్ చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టమైన సూచనలు జారీ చేసింది. దర్యాప్తు బృందం పూర్తిగా చట్టబద్ధంగా, మానవహక్కులకు విరుద్ధంగా కాకుండా వ్యవహరించాలని కోర్టు ఆదేశించింది.
కేసులో కీలక మలుపు
ఫోన్ ట్యాపింగ్ కేసు ఏకకాలంలో రాజకీయ, చట్టపరంగా ప్రాధాన్యం సంతరించుకున్న నేపథ్యంలో, సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు పరిశీలనీయంగా మారాయి. ప్రభాకర్ రావు సరెండర్ తర్వాత దర్యాప్తు వేగం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేసు మొత్తానికి ఇది ఒక టర్నింగ్ పాయింట్ గా నిలిచే అవకాశం ఉన్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# తిరుమలలో ప్రయోగాత్మకంగా రిసైకిల్ మిషన్ల ఏర్పాటుపై అదనపు ఈవో సమీక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా రిసైకిల్ మిషన్ల ఏర్పాటుపై గురువారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.
సెప్టెంబర్ నెలలో ప్రయోగాత్మకంగా తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-5 (%ూూజ%-5) లో ఏర్పాటు చేసిన రెక్లెయిమ్ డిపాజిట్ రీఫండ్ మిషన్లకు విశేష స్పందన రావడంతో తిరుమలలో ఈ మిషన్లను మరి కొన్నింటిని పరిశీలనాత్మకంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.
తిరుమలలో టెట్రాపాక్ మరియు టిన్ లలో పానీయాలను స్వీకరించిన అనంతరం భక్తులు ఎక్కడంటే అక్కడ పడేయకుండా ఈ డిపాజిట్ రీఫండ్ మెషిన్ల లో వేస్తే తిరుమలలో పరిశుభ్రత మరింత మెరుగు పడేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ విషయం పై తిరుమలలోని వ్యాపారులు, టెట్రా ప్యాక్ డీలర్లు కూడా తోటి వారిలో అవగాహన కల్పించాలని కోరారు.
స్వచ్ఛ తిరుమలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడంలో భాగంగా ఒక ఉద్యమంలా రెక్లైమ్ రీసైకిల్ మెషిన్లపై భక్తులకు విస్తృతంగా అవగాహన కల్పించి తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మరిన్ని మెషిన్ల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు ఈవో ఆదేశించారు.
ఈ సమావేశంలో డీఎఫ్ఓ ఫణి కుమార్ నాయుడు, డిప్యూటీ ఈవోలు సోమన్నారాయణ, వేంకటేశ్వర్లు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధు సూదన్, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, రెక్లైమ్ రీసైకిల్ సంస్థ ప్రతినిధులు కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
: సిరిసిల్ల జిల్లా లో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేల భద్రత పరమైన పలు సూచనలు జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే చేశారు ఎస్పీ మాట్లాడుతూ మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారని ఎస్పీ తెలిపారు

## రొమ్ము క్యాన్సర్ పై అవగాహనకు ఫిబ్రవరిలో పింకథాన్

**హైదరాబాద్ పెన్ పవర్:**
రొమ్ము క్యాన్సర్ ను అలస్యంగా గుర్తించడం ద్వారా మహిళలు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో రొమ్ము క్యాన్సర్పై అవగాహన కల్పించేందుకు హెల్త్ కేర్ సంస్థ జైడస్ భాగస్వామ్యంతో ఫిబ్రవరి 14, 15 తేదీల్లో హైదరాబాద్ లోని పీపుల్స్ ప్లాజా నుంచి పింకథాన్ రన్ కొనసాగ నుంది. మూడు కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల వరకు వివిధ దశల్లో ఈ రన్ ను నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్ లోని పార్క్ హయత్ హొటల్లో పింకథాన్ వ్యవస్థాపకుడు, నటుడు మిలింద్ సోమన్, సర్జి కల్ అంకాలజిస్టు డా. మోహనవంశీ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ రంగాల మహిళలు పాల్గొన్నారు.

## పోలీసులకు హాస్టల్ విద్యార్థుల వినతి

**హైదరాబాద్ పెన్ పవర్:**హాస్టల్ లో సరైన వసతులు లేక,నాణ్యమైన ఆహారం,హాస్టల్ పైకప్పు పెచ్చులు ఊడిపడడం,అన్నంలో పురుగులు రావడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని హాస్టల్ డిప్యూటీ వార్డెన్కు పిర్యాదు చేస్తే దుర్భషాలాడుతూ తమను కొడుతు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని సుమారు 200 మందికి పైగా శామీర్ పేట మహాత్మా జోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు శామీర్ పేట పోలీస్ స్టేషన్కు పరుగులు తీశారు.విద్యార్థుల సమస్య తెలుసుకున్న పోలీసులు హాస్టల్ ను సందర్శించి పరిసరాలను వంట గదిని పరిశీలించారు.హాస్టల్ విద్యార్థులకు పోలీసులు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## ఇసుక సీజ్



**హైదరాబాద్ పెన్ పవర్:**మండలం పరిధిలో ముద్దట మాగి గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి అవసరం లేకపోయినా బుధవారం అక్రమంగా ఇసుకను తరలించి, డంప్ చేసిన ఇసుక ను రెవెన్యూ ఇన్స్పెక్టర్ మహేష్, వారి సిబ్బంది తో కలిసి ఇసుక ను సీజ్ చేసి రెవెన్యూ శాఖ కు అప్పగించడం జరిగింది...ఎస్సై దిలీప్ కుమార్, వీఆర్వో నాగరాజు సూర్య ఆంజనేయులు పాల్గొన్నారు

## 30 కుటుంబాలు టిడిపిలో చేరిక

**హైదరాబాద్ పెన్ పవర్:**వైఎస్ఆర్సిపి పార్టీలో నుండి టీడీపీ లో చేరిన బద్వేలు మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే వి సుబ్బారావు లికె,వి సుబ్బారావుకు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బద్వేలు టిడిపి ఇన్చార్జి లతేష్ రెడ్డికె.వి సుబ్బారావు తో పాటు 30 కుటుంబాలు టిడిపిలోకి చేరికలిపలువురికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టిడిపి నాయకులు

## ప్రమాదవశాతు వ్యక్తి మృతి.

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది.వివరాలోకెళ్తే స్థానిక బస్టాండ్ పక్కన బీసీ కాలనికి వెళ్లే మచ్చవలి కిరణ షాపు ముందు కొరిచేవంక బ్రిడ్జి చిన్నగా ఉండడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న రోడ్డె సిద్ధప్ప(40) అదుపుతప్పి ద్విచక్ర వాహనంతో వంకలో పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.మృతుడికి భార్య,ఒక కుమార్తె,ఇద్దరు కుమారులు ఉన్నారు. రొడ్డే సిద్ధప్ప మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యం తమయ్యారు. మృతి చెందిన రోడ్డె సిద్ధప్ప అమాలి పని చేసేవాడు .రాష్ట్ర ప్రభుత్వం మృతుడి కుటుంబాని ఆదుకోవాలని కోరారు.

## ముషీరాబాద్ లో జాబ్ మేళా

**హైదరాబాద్ పెన్ పవర్:**ముషీరాబాద్ నియోజకవర్గం లో తొలిసారిగా తలారి దినకరన్ రెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా%-%2025 నిర్వహించబోతున్నారు. హెరిటేజ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో జరగనున్న ఈ ఉద్యోగ మేళాలో 150కి పైగా కంపెనీలు పాల్గొననున్నట్లు వెల్లడించారు.ఈ జాబ్ మేళా ద్వారా సుమారు 5,000 మందికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు దినకరన్ రెడ్డి తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒకరు నిరుద్యోగిగా ఉన్న నేపథ్యంలో, ఆ కుటుంబాలకు అండగా నిలబడాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఈ జాబ్ మేళా ఉపయోగపడనుందిని తెలియజేశారు

## బీజేపీ ఎంపీలపై మోడీ ఆగ్రహం !



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ బీజేపీ ఎంపీలపై ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర సరిగ్గా పోషించలేకపోతున్నారం టూ మండిపడ్డారు. తెలంగాణ, ఏపీ ఎన్డీఏ ఎంపీలతో జరిగిన విందులో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏపీలో సీఎం చంద్రబాబు పాలన భేష్ అని ప్రశంసించారు. సుపరిపాలనతో ఏపీకి ఎక్కువ పెట్టుబడులు వస్తున్నాయని కొనియాడారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలని ఎంపీలకు పిలుపునిచ్చారు.

## చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా తొలి విడుత పోలింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రవ్యాప్తంగా తొలి విడుత ఎన్నికల పోలింగ్ ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్.. మధ్యాహ్నం ఒంటిగంటతో పూర్తయ్యింది. పలుచోట్ల ఒంటిగంట వరకు క్యూలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానున్నది. రాత్రి వరకు పోలింగ్ ఫలితాలు ప్రకటించి.. ఉప సర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నారు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించారు.తొలి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా.. ఇందులో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. 12,960 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్ఈసీ కమిషనర్ పేర్కొన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారులను, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా 3,461 పోలింగ్ కేంద్రాలను.. 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తున్నట్లు చెప్పారు.

# నరేగా నుంచి 16 లక్షల పేర్లు తొలగింపు ...118 లక్షలపేర్లు చేరిక

**హైదరాబాద్ పెన్ పవర్:**

లోక్‌సభలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖనునరేగా జాబ్ కార్డుల నుంచి ఎంత మంది కార్మికుల పేర్లను తొలగించారు అని ప్రశ్నించారు. ఇది eKYC కారణంగా జరిగిందా? దీనికి సంబంధించి అక్టోబర్ 14 నుంచి నవంబర్ 14 మధ్య సమాచారం కోరారు. దీనికి సమాధానంగా, లోక్‌సభలో గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ మాట్లాడుతూ, అక్టోబర్ 10 నుంచి నవంబర్ 14, 2025 మధ్య 16.31 లక్షల మంది కార్మికుల పేర్లను నరేగా జాబితా నుంచి తొలగించినట్టు ప్రకటించారు. నరేగా జాబ్ కార్డులను తొలగించడం అనేది ఒక సాధారణ ప్రక్రియ, దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిర్వహిస్తుంది.మంత్రి %వ-ఖ్జ% గురించి కూడా సమాచారం ఇచ్చారు, తొలగించిన పేర్లకు %వఖ్జ% అమలు చేయడం ప్రధాన కారణం కాదని తెలిపారు. మంత్రి ప్రకారం, జాబ్ కార్డులను ప్రధానంగా నకిలీ లేదా నకిలీవిగా గుర్తించినప్పుడు, కుటుంబం గ్రామాన్ని విడిచిపెట్టి శాశ్వతంగా వేరే చోట స్థిరపడినప్పుడు, గ్రామ పంచాయతీ పట్టణ ప్రాంతంగా ప్రకటించినప్పుడు లేదా జాబ్ కార్డు హెూల్డర్ మరణించినప్పుడు తొలగిస్తారు. అర్హత కలిగిన కార్మికుడి జాబ్ కార్డు తొలగించకుండా చూసుకోవడానికి రాష్ట్రాలకు కఠినమైన మార్గదర్శకాలు కూడా జారీ చేశామని ఆయన అన్నారు. నరేగా లో హాజరును నమోదు చేయడానికి యాప్ ఇప్పటికే తప్పనిసరి చేశారు. కార్మికుల రెండు టైమ్-స్టాంపులు, జియో-ట్యాగ్ చేసిన ఫోటోలు ప్రతిరోజూ అప్‌లోడ్ చేస్తున్నారు. వేతన చెల్లింపులో ఆలస్యం కాకుండా ఉండటానికి ఆధార్ పేమెంట్ బ్రిడ్జ్ సిస్టమ్ అమలు చేశారు. ఈ సాంకేతిక ఏర్పాట్ల కారణంగా ఎవరి జాబ్ కార్డు తొలగించలేదని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఆర్థిక సంవత్సరం 2025-26లో డిసెంబర్ 5 నాటికి మొత్తం 54.02 లక్షల జాబ్ కార్డులు తొలగించారు, అయితే 118.57 లక్షల మంది కొత్త కార్మికులు ఈ పథకంలో చేరారు. అంటే, పథకంలో కొత్త నమోదులు తొలగించిన పేర్ల కంటే చాలా ఎక్కువ.

# మెస్సీ టూర్ కు ప్రభుత్వానికి సంబంధం లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని ఆయన తెలిపారు.అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తాను కూడా ఒక అతిథిగా మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఈ ఈవెంట్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో కలిసిన ప్రముఖులను కూడా ఈ కార్యక్రమానికి రావాలని కోరినట్లు తెలిపారు.'మెస్సీ గోట్ ఇండియా టూర్'లో భాగంగా ఈ నెల 13న మెస్సీ హైదరాబాద్ రానున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆయన పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో మెస్సీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పలువురు అంతర్జాతీయ క్రీడాకారులు కూడా రెండు జట్లుగా విడిపోయి ఆడనున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# అరుణాచల్ లో ఘోర ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:**
అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇండో-చైనా సరిహద్దుకు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 21 మంది కార్మికులతో వెళుతున్న ఓ ట్రక్కు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 17 మంది కార్మికులు మరణించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. అంజావ్ జిల్లాలోని హయులియాంగ్-చగ్లాగం రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.
వివరాల్లోకి వెళితే... ఈ ప్రమాదం మూడు రోజుల తర్వాత ఈరోజు వెలుగులోకి వచ్చింది. ట్రక్కుతో పాటు లోయలో పడిపోయిన వారిలో ప్రాణాలతో బయటపడిన ఓ కార్మికుడు, తీవ్ర గాయాలతో సమీపంలోని పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ అధికారులకు సమాచారం అందించడంతో ఈ విషాద ఘటన గురించి బాహ్య ప్రపంచానికి తెలిసింది.ఈ విషయాన్ని అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కోజిన్ ధృవీకరించారు. ప్రమాదం జరిగిన ప్రదేశం అంతర్జాతీయ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి 10,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉందని ఆయన తెలిపారు. సమాచారం అందిన వెంటనే అధికారులు సహాయక చర్యలపై దృష్టి సారించారు.

# ప్పనిసరిగా 2 నిమిషాల పాటు దంతాలను బ్రష్‌తో తోమాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**అందమైన దంతాల వరుస కావాలన్నా.. దంతాలు మిల మిలలాడు తూ మెరవాలన్నా.. ఎవరైనా ఏం చేయాలి? దంతాలను సరిగ్గా తోమాలి. శుభ్రం చేసుకోవాలి. అంతే..! కానీ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అధిక శాతం మంది దంతాలను సరిగ్గా తోమడం లేదట. నిత్యం రెండు సార్లు దంతధావనం చేయాలని డెంటిస్టులు చెబుతున్నా, కనీసం ఒక్కసారి తోమినప్పుడు కూడా దంతాలను ఎవరూ సరిగ్గా శుభ్రం చేసుకోవడం లేదట. దీని వల్ల అనేక దంత సమస్యల బారిన పడాల్సి వస్తుందని వారు అంటున్నారు. ఈ క్రమంలో దంత సంరక్షణ కోసం ఉపయోగించే టూత్‌బ్రష్ పట్ల కూడా కొన్ని విషయాలు తప్పనిసరిగా తెలుసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సాఫ్ట్ బ్రిజిల్స్ ఉన్న టూత్ బ్రష్‌లను మాత్రమే వాడాలి

సాఫ్ట్ బ్రిజిల్స్ ఉన్న టూత్ బ్రష్‌లను మాత్రమే వాడాలి సాఫ్ట్ బ్రిజిల్స్ ఉన్న టూత్ బ్రష్‌లను మాత్రమే వాడాలి. ఎందుకంటే హార్డ్ బ్రిజిల్స్ దంతాలకు, చిగుళ్లకు హాని కలిగిస్తాయి. కాబట్టి సాఫ్ట్, అల్ట్రా సాఫ్ట్ అని రాసి ఉన్న టూత్‌బ్రష్‌లను మాత్రమే వాడాలి. కనీసం 3, 4 నెలలకోసారి అయినా టూత్ బ్రష్‌లను మార్చాలి. లేదంటే వాటిలో బాక్టీరియా పెరిగిపోయి అవి నేరుగా మన జీర్ణాశయంలోకి వెళ్లి ఇతర అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. అయితే ఫ్లూ జ్వరం, దగ్గు, జలుబు వంటివి వచ్చినప్పుడు కూడా టూత్‌బ్రష్‌లను మార్చాలి. ఎందుకంటే అవి తగ్గాక కూడా బాక్టీరియా ఆ బ్రష్‌లలో అలాగే ఉంటుంది. దీంతో మళ్లీ మనకు ఆ అనారోగ్యాలు కలిగేందుకు అవకాశం ఉంటుంది. చాలా మందికి టూత్‌బ్రష్‌లను బాత్‌రూంలలో పెట్టడం అలవాటు. అయితే ఆ అలవాటును ఇప్పుడైనా మానండి. ఎందుకంటే బాత్‌రూంలలో ఉండే హానికరమైన బాక్టీరియా మన టూత్‌బ్రష్‌ల పైకి సులభంగా చేరుతుంది. దీని వల్ల కూడా మన ఆరోగ్యం చెడిపోయేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి వాష్‌రూంలలో టూత్‌బ్రష్‌లను ఉంచకూడదు.ఇతరుల టూత్ బ్రష్‌లతో కలిపి ఉంచకూడదుఒకే బాక్స్‌లో అన్ని టూత్‌బ్రష్‌లను కూడా ఉంచకూడదు. లేదంటే ఇతరుల బ్రష్‌లలో ఉండే బాక్టీరియా మన బ్రష్‌లపై కూడా చేరేందుకు అవకాశం ఉంటుంది. మన నోట్లో ఎల్లప్పుడూ 200 నుంచి 500 రకాల బాక్టీరియా నివాసం ఉంటుందట. దీన్ని నివారించాలంటే రోజుకి కనీసం 2 సార్లు, ప్రతి సారి 2 నిమిషాల పాటు దంతాలను తోముకోవాలట. అలా తోముకోకపోతే బాక్టీరియా మొత్తం అలాగే ఉండి నోటి దుర్వాసన, దంత క్షయం వంటి సమస్యలు వస్తాయి. టూత్‌బ్రష్‌పై ఎలాంటి క్యాప్ ఉంచకూడదు. దీని వల్ల బ్రిజిల్స్‌పై బాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది మన దంతాలకు సమస్యలను కలగజేస్తుంది. ఇక ఓ సంస్థ చేపట్టిన సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజల్లో అధిక శాతం మంది నిత్యం 45 నుంచి 70 సెకండ్లలోపే దంతాలను తోమడం ముగించేస్తారని తేలింది. కానీ తప్పనిసరిగా 2 నిమిషాల పాటు దంతాలను తోమాల్సిందేనని దంత వైద్యులు చెబుతున్నారు

# అమీనాపూర్ లో పరువు హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ప్రేమించినందుకు ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కుమార్తెను ప్రేమించాడని ఇంజినీరింగ్ విద్యార్థి శ్రవణ్ సాయి అలియాస్ శివను ఆమె తల్లిదండ్రులు బ్యాట్లు, కత్తులతో కొట్టి చంపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, సృజన్ లక్ష్మీ నగర్‌లో డిసెంబర్ 8 రాత్రి ఈ హత్య జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి, తల్లిదండ్రులతో పాటు బంధువులను అరెస్ట్ చేశారు. శ్రవణ సాయి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం చేసి, కుటుంబానికి అందజేశారు. శ్రీజ, శ్రవణ సాయి ఇద్దరూ అమీన్‌పూర్‌లోని ఒకే స్కూల్‌లో 10వ తరగతి చదువారు. స్నేహం ప్రేమగా మారి, ఇంటర్, డిగ్రీలో కూడా కొనసాగింది. ప్రస్తుతం శ్రీజ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది. శ్రవణ సాయి హైదరాబాద్‌లోని ప్రైవేట్ కాలేజీలో ఇంజినీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరూ ఒకే కాలనీలోనే ఉండటంతో ప్రేమ వ్యవహారం అందరికీ తెలిసిపోయింది. శ్రీజ తల్లిదండ్రులు ఈ ప్రేమకు వ్యతిరేకంగా ఉండేవారు. శ్రీజ శ్రవణ సాయిని పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేస్తోందని తెలుస్తోంది. డిసెంబర్ 8 రాత్రి, పెళ్లి విషయంపై మాట్లాడుదామని" శ్రీజ తల్లిదండ్రులు సాయిని తమ ఇంటికి పిలిచారు. సాయిని ఇంట్లోకి వెళ్లిన వెంటనే బ్యాట్లు, కత్తులతో దారుణంగా కొట్టారు. తీవ్ర గాయాలతో పడిపోయిన సాయిని, ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించి, బంధువులు పారిపోయారు. అమీన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో తీవ్ర గాయాలకు చికిత్స పొందుతూ డిసెంబర్ 9 ఉదయం శ్రవణ్ సాయి మరణించాడు. మెడలో, తలపై గాయాలు, అధిక రక్తస్రావం కారణంగా మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. %ఖూజ% సెక్షన్లు 302 (హత్య), 506 (బెదిరింపు) కేసు దాఖలు చేశారు. శ్రీజ తల్లి , తండ్రి , చెల్లెలు, చెల్లెలు భర్త మొత్తం ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. హత్యా ఆయుధాలు, రక్తం మరకలు ఉన్నదుస్తులు స్వాధీనం చేసుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్, సాయి మొబైల్ చాట్స్‌ను ఆధారంగా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇది పరువు హత్యేనని... నిందితులు కుల వ్యత్యాసాన్ని సహించలేక ఈ హత్య చేశారని పోలీసులుచెబుతున్నారు.

# యునెస్కో జాబితాలో దీవాళి

**హైదరాబాద్ పెన్ పవర్:**
దీపావళికి యునెస్కో జాబితాలో చోటు దక్కింది. యునెస్కో ఇంటర్‌గవర్నమెంటల్ కమిటీ సమావేశంలో దీపావళికి చోటు దక్కింది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్, అనేక ప్రభుత్వ భవనాలను దీపాలతో, లైటింగ్‌తో అలంకరిస్తున్నారు. ప్రభుత్వం దీనిని జాతీయ విజయంగా పరిగణిస్తూ దేశవ్యాప్తంగా లైటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఢిల్లీ, కేంద్ర ప్రభుత్వం ప్రకారం, ఎర్రకోట ఈ వేడుకకు ప్రధాన కేంద్రంగా ఉంటుంది, ఇక్కడ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. కాబట్టి, దీపావళిని యునెస్కో సాంస్కృతిక వారసత్వంగా గుర్తించ డానికి ముందు ఏయే భారతీయ పండుగలకు ఈ గౌరవం దక్కిందో తెలుసుకుందాం.

భారతదేశంలోని ఏయే పండుగలు, సంప్రదాయా లకు ఈ హోదా లభించింది

దీపావళికి ముందు, భారతదేశంలోని మొత్తం 15 సాంస్కృతిక సంప్రదాయాలు యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ సంప్రదాయాలు భారతదేశ వైవిధ్యం, జానపద కళలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని సూచిస్తాయి.

కుటియాట్టం, కేరళ-2008- కుటియాట్టం భారతదేశంలో పురాతనమైన జీవన సంస్కృత రంగస్థలం. దీనిని 2008లో యునెస్కో అదృశ్య సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చారు. వేద మంత్రోచ్చారణ, 2008- వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వేద మంత్రాల మౌఖిక సంప్రదాయాన్ని కూడా 2008లో యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చారు.

రామలీల, 2008-భగవాన్ రాముని కథను దేశవ్యాప్తంగా దీపావళికి ముందు ప్రదర్శిస్తారు, దీనిని కూడా 2008లో యునెస్కో తన సాంస్కృతిక జాబితాలో చేర్చింది.

రామమన్, 2009- ఉత్తరాఖండ్- రామమన్ ఉత్తరాఖండ్‌లోని గర్హ్వాల్ కమ్యూనిటీ స్థానిక మతపరమైన సాంస్కృతిక కార్యక్రమం, ఇది సలూర్ దుంగ్రా గ్రామంలో జరుపుకుంటారు. దీనిని కూడా 2009లో యునెస్కో జాబితాలో చేర్చారు. ఛౌ నృత్యం, 2010-పశ్చిమ బెంగాల్- జార?ండ్, ఒడిశాకు చెందిన మూడు వేర్వేరు శైలులతో కూడిన నృత్యాన్ని కూడా యునెస్కో జాబితాలో చేర్చారు.

కాల్‌బెలియా నృత్యం, 2010- రాజస్థాన్- రాజస్థాన్ సపేరా సమాజానికి చెందిన ప్రసిద్ధ జానపద నృత్యం కాల్‌బెలియాను కూడా యునెస్కో తన జాబితాలో చేర్చింది. ఈ నృత్యం దాని లయ, వేగవంతమైన కదలికలకు ప్రసిద్ధి చెందింది.

ముడియెట్టు, 2010-కేరళ- కేరళ ముడియెట్టు మతపరమైన నాటక సంప్రదాయం, దీనిని యునెస్కో తన జాబితాలో చేర్చింది. లడఖ్ బౌద్ధ జపం, 2012- టిబెటన్ బౌద్ధ సంప్రదాయానికి చెందిన లడఖ్ బౌద్ధులను కూడా యునెస్కో తన జాబితాలో చేర్చింది. ఇది సాధువులు పఠించే పవిత్ర గ్రంథం.

మణిపూర్ సంకీర్తన, 2013- శ్రీ కృష్ణ భక్తి ఆధారంగా మణిపూర్‌కు చెందిన సంకీర్తనను కూడా 2013లో యునెస్కో జాబితాలో చేర్చారు. తామ్ర పనివారి లోహపు పనితనం, 2014- పంజాబ్- జండియాలా గురులో తయారు చేసే సాంప్రదాయ ఇత్తడి, రాగి కళను కూడా యునెస్కో తన జాబితాలో చేర్చింది. నౌరోజ్, 2016- పార్సీ సమాజం నూతన సంవత్సరం అంటే నౌరోజ్‌ను కూడా యునెస్కో 2016లో తన జాబితాలో చేర్చింది.

యోగా, 2016- శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సమతుల్యతతో కూడిన యోగాను కూడా 2016లో యునెస్కో తన జాబితాలో చేర్చింది.

కుంభమేళా, 2017- భారతదేశంలోని నాలుగు నగరాల్లో నిర్వహించే ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమావేశం. దీనిని కూడా 2017లో యునెస్కో తన జాబితాలో చేర్చింది.

కోల్‌కతా దుర్గా పూజ, 2021- కోల్‌కతాలో జరిగే దుర్గా పూజ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. 2012లో కోల్‌కతా దుర్గా పూజను యునెస్కో తన జాబితాలో చేర్చింది.

గుజరాత్ గర్బా, 2023- నవరాత్రుల సమయంలో ఆడే గుజరాత్ గర్బా ప్రపంచవ్యాప్తంగా తనదైన ముద్ర వేస్తుంది. 2023లో గుజరాత్‌లో జరిగే గర్బాను కూడా యునెస్కో తన జాబితాలో చేర్చింది.

సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలు

యునెస్కో జాబితాలో చేర్చడం ఏదైనా సంప్రదాయానికి గొప్ప గౌరవంగా పరిగణిస్తారు. దీనికి అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. యునెస్కో జాబితాలో చేర్చడం వల్ల పండుగ లేదా సంప్రదాయానికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతుంది. దీనితో పాటు, యునెస్కో ఈ సంప్రదాయాలను భద్రపరచడానికి, డాక్యుమెంట్ చేయడానికి, భవిష్యత్ తరాలకు అందించడానికి సహాయపడుతుంది. ఇది దేశంలో పర్యాటకుల సంఖ్యను పెంచుతుంది, ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తుంది. స్థానిక కళాకారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. దీనితో పాటు, అవసరమైనప్పుడు యునెస్కో ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని కూడా అందిస్తుంది.

# రాహుల్, సోనియాలను కలిసిన రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో సమావేశమయ్యారు. ఈ ఉదయం పార్టీ ఎంపీలతో కలిసి ఆయన అధిష్ఠానంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు వంటి కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను, ప్రభుత్వ పాలన తీరును రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పెద్దలకు వివరించారు. ముఖ్యంగా, ఇటీవల హైదరాబాద్ వేదికగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ఘన విజయం సాధించిన విషయాన్ని సోనియా గాంధీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తరలివచ్చాయని ఆయన తెలిపారు. కేవలం రెండు రోజుల్లోనే వివిధ రంగాల్లో కలిపి రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని రేవంత్ రెడ్డి అధిష్ఠానానికి వివరించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర అభివృద్ధికి ఈ పెట్టుబడులు ఎలా దోహదపడతాయో ఆయన వివరించినట్లు తెలుస్తోంది.

# ప్రశాంతంగా ముగిసిన తొలివిడత పోలింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నేటి ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. అయితే, పలుచోట్ల 1 గంట సమయానికే క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. పోలింగ్ ముగియడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. రాత్రికి ఫలితాలు వెల్లడించి, ఉప సర్పంచ్‌ల ఎన్నిక కూడా పూర్తి చేయనున్నారు. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ చాలావరకు శాంతియుతంగా జరిగిందని అధికారులు తెలిపారు. కలెక్టర్లు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పోలింగ్ ప్రక్రియను సమీక్షించారు. మొదటి విడతలో భాగంగా మొత్తం 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా, వాటిలో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,834 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, 12,960 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మూడు విడతల్లో జరగనున్న ఈ ఎన్నికల కోసం మొత్తం 93,905 మంది సిబ్బందిని నియమించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. వీరితో పాటు 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లు విధుల్లో పాల్గొన్నారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగించినట్లు అధికారులు తెలిపారు.